క్లుప్తంగా

నేడు వాడపల్లిలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూజలు

ఆత్రేయపురం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మండలంలోని వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమలలో లడ్డూను అపవిత్రం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అపచారానికి నిరసనగా ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ నేతలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు హిందూమతాన్ని దుర్వినియోగం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి తగిన గుణపాఠం చెప్పేందుకు ఈ పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భగవన్నామ సంకీర్తనలతో మోక్షం

ఆలమూరు: హరినామ సంకీర్తనలతో, నిత్యం దైవాన్ని స్మరించుకోవడం వల్ల మోక్షం లభిస్తుందని స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ముకుంద స్వామి అన్నారు. స్థానిక ఆలయ ప్రాంగణంలోని అన్న ప్రసాద సౌధం, బ్రహ్మ జ్ఞానేశ్వరి పీఠంలో వారం రోజుల నుంచి జరుగుతున్న పురందర దాసుల సంకీర్తన సప్తాహం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా దాస సాహిత్య ప్రాజెక్టుకు చెందిన హరే శ్రీనివాస భక్త బృందం దేవతామూర్తుల వేషధారణతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

రావులపాలెం టౌన్ సీఐగా శేఖర్ బాబు


శేఖర్ బాబు

రావులపాలెం: టౌన్ సీఐగా ఎం.శేఖర్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. దేవరపల్లిలో ఇన్‌చార్జి సీఐగా చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయన గతంలో ఆత్రేయపురం, ఆలమూరు మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్సైగా పని చేశారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన శేఖర్ బాబుకు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

భారీ వర్షం

అయినవిల్లి: అల్పపీడనం ప్రభావంతో మండలంలోని శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. విడవకుండా కురిసిన వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు ముంపు బారిన పడ్డాయి. అలాగే రహదారులపైకి వర్షం చేరి జలాశయాలను తలపించింది. దీంతో కూరగాయ పంటలు వర్షపునీటి ముంపునకు గురయ్యాయి. తమ పంటలు పూర్తి దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు.

పి.గన్నవరంలో జాబ్ మేళా


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్ మాధుర్

పి.గన్నవరం: నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అమలాపురం ఎంపీ జి.హరీష్ మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గ్రేస్ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళాను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.లోకమాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 20 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 559 మందికి ఉద్యోగాలు కల్పించారు. వీరికి ఎమ్మెల్యే గిడ్డి నియామక ఉత్తర్వులు అందించారు. జిల్లా ఉపాధి సంస్థ అధికారి వసంతలక్ష్మి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, గ్రేస్ కళాశాల డైరెక్టర్ ఎస్.శ్రీచరణ్, ప్రిన్సిపల్ పీవీఆర్ నాయుడు, డీఎస్‌ఓ నాగబాబు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.రాజేంద్రప్రసాద్, వైపీ రాజకుమార్, నాయకులు వినోద్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తం ద్వారా రూ.కోటి రుణాలు

మామిడికుదురు: రైతు నేస్తం పథకం ద్వారా 14 మంది రైతులకు రూ.కోటి రుణాలు అందించామని మామిడికుదురులోని నగరం పీఏసీఎస్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ గుబ్బల మురళీసత్యనారాయణ తెలిపారు. సొసైటీ మహాజన సభ శుక్రవారం జరిగింది. సత్యనారాయణ మాట్లాడుతూ సొసైటీలో 1059 మంది సభ్యులున్నారని తెలిపారు. 629 మంది రైతులకు స్వల్పకాలిక రుణాలుగా రూ.4.60 కోట్లు అందించామన్నారు. దీర్ఘకాలిక రుణాలుగా 92 మందికి రూ.2.03 కోట్లు రుణాలుగా ఇచ్చామన్నారు. ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన రైతు నేస్తం ద్వారా ఎకరానికి రూ.8 లక్షల వంతున తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నామన్నారు. 53 మంది రైతులకు బంగారం తాకట్టుపై రూ.55 లక్షలు అందించామని తెలిపారు. సొసైటీల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్య కార్యనిర్వహణాధికారి రొక్కం కుమార్‌జనార్దనరెడ్డి, రైతులు నయినాల సత్యనారాయణమూర్తి, భైరిశెట్టి సత్యనారాయణ, నయినాల శ్రీరంగనాథం, రామేశ్వరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాజా ఆహారం.. ఆరోగ్యానికి శ్రేయస్కరం

- పరిశుభ్రతతో వ్యాధులు దూరం
- వ్యాయామం తప్పనిసరి
- పండ్లతో వ్యాధి నిరోధకత


డ్రై ఫ్రూట్స్


వివిధ రకాల పండ్లు

ఆలమూరు: చక్కని ఆహారపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు సంపూర్ణ ఆరోగ్యానికి రక్షణ కవచంలా పనిచేస్తాయి. కోవిడ్ అనుభవాల తరువాత ప్రతి ఒక్కరి జీవనశైలిలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. జీవితంలో ఆదాయ వనరుల కంటే ఆరోగ్యాన్నే సమకూర్చుకోవాలన్న భావన ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతుంది. వైద్యుల సూచనలు, సలహాల మేరకు వ్యాయామ పద్ధతులు పాటించడం ద్వారా వ్యాధి నిరోధకశక్తిని పెంపొందించుకుని అంటువ్యాధుల నుంచి తమకు తాము రక్షించుకునే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

అపరిశుభ్రతే వ్యాధులకు మూలం

వాతావరణ ప్రతికూల పరిస్థితులతో పాటు అధిక వర్షాలు, అపరిశుభ్రమైన వాతావరణం, కలుషిత నీరు ప్రభావంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర సీజనల్ వ్యాధులు విస్తృతంగా వ్యాప్తి చెంది ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నాయి. చికిత్స పొందిన తరువాత జ్వరం తగ్గినా నీరసం మాత్రం తగ్గడం లేదు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, మేలైన ఆహారపు అలవాట్లు, చక్కని పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఎటువంటి వ్యాధులనైనా అధిగమించి సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు. ఫైబర్ అధికంగా ఉండే సూక్ష్మ పోషక పదార్థాలైన తాజా ఆకుకూరలు, పండ్లను ఆహారంగా తీసుకుంటే పౌష్టికత పెరుగుతుంది. అలాగే డ్రైఫ్రూట్స్ తీసుకుంటే శరీరంలో పోషక విలువలు పెరిగి మరింత బలం చేకూరుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్స్, శీతల పానీయాలు, ఫ్రిజ్‌లో ఉంచిన ఆహార పదార్థాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దూరంగా ఉండాలి.

ఆహార అలవాట్లలో జాగ్రత్తలు అవసరం

ఆహారాన్ని మితంగా తినాలి. ఆహారంలో తప్పనిసరిగా పప్పు ధాన్యాలు లేదా డ్రైఫ్రూట్స్ ఉండేలా చూసుకోవాలి. అలాగే వీలైనంత మేరకు ఆకుకూరలు తినేలా ప్రయత్నించాలి. అలాగే ఉడకబెట్టిన కోడిగుడ్డును రోజుకు ఒకటి చొప్పున, చికెన్ కాని మటన్ కాని వారానికి ఒక్కసారి తినేలా ఆహారపు అలవాట్లు ఉండాలి. అలాగే దైనందిన జీవితంలో కూడా ఈ విధంగా ఆహారం తీసుకుంటే ఆరోగ్యానికి చక్కని పౌష్టికాహారంతో పాటు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. ప్రతి రోజు శరీరానికి అవసరమైన నీరు తాగితే 50 శాతం రుగ్మతలను నివారించవచ్చు. ప్రతి రోజు ఆహారంలో ఆకుకూరలు, పప్పుధాన్యాలు ఉండేటట్లు చూసుకోవాలి. క్రమం తప్పకుండా జామ, ఉసిరి, దానిమ్మ తదితర పండ్లను ఆహారంలో తీసుకోవాలి. రోజుకు ఒకటి లేక రెండు సార్లు మాత్రమే కాఫీ, టీ సేవించాలి. వారానికి ఒక రోజు మాంసాహారాన్ని తీసుకోవడంతో పాటు ప్రతి రోజు ఉడికించిన గుడ్డును తీసుకోవాలి.

వ్యాయామం తప్పనిసరి

దైనందిన వ్యాయామం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. శారీరక, మానసిక ఒత్తిడిని తొలగించి, దృఢమైన ఆత్మవిశ్వాసం కలగజేస్తుంది. వ్యాయామం చేయడం వల్ల శరీర బరువును నియంత్రించి రక్త ప్రసరణ వ్యవస్థను మెరుగుపర్చుతుంది. కండరాలను దృఢంగాను, ఎముకలను బలంగాను ఉంచుతుంది. స్థూలకాయం, గుండె సంబంధిత వ్యాధుల బారి నుంచి రక్షిస్తుంది. మానసిక రుగ్మతలు, నిద్రలేమి, మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చు.

విటమిన్లతో శ్వాసకోస వ్యాధులకు చెక్



పలురకాల విటమిన్లతో అనేక వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. బొప్పాయి, మామిడి, జామ, దానిమ్మ వంటి ఏ–విటమిన్ కలిగిన ఆహారాన్ని తీసుకుంటే అంధత్వ నివారణతో పాటు శ్వాసకోస వ్యాధులను నివారించవచ్చు. కెరోటిన్ అధికంగా ఉన్న మునగాకు, తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్ తీసుకోవాలి. అలాగే సీ–విటమిన్ పుష్కలంగా ఉన్న నారింజ, నిమ్మ, బత్తాయి వంటి పండ్లను సలాడ్ల రూపంలో తీసుకుంటే చాలా మంచిది. దీంతో పాటు సూర్యరశ్మి ద్వారా శరీరానికి దృఢత్వం ఇచ్చే డీ–విటమిన్ లభిస్తుంది. ఈ విటమిన్లు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.

– డి.సువర్చలాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల్ల

చంద్రబాబు, పవన్ కల్యాణ్ తీరుపై రాస్తారోకో


మామిడికుదురులో రాస్తారోకో చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మామిడికుదురు: తిరుపతి లడ్డూ అంశంలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమం మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం ఎదురుగా 216వ నంబర్ జాతీయ రహదారిపై జరిగింది. చంద్రబాబు మత విద్వేషాలను సృష్టిస్తున్నారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజల్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు మండిపడ్డారు. సచివాలయ ఉద్యోగులను వేధిస్తూ వారిని పార్టీ కార్యకర్తల్లా మార్చుతున్నారని అన్నారు. తిరుపతి లడ్డూ వ్యవహారంపై నిజాలను నిగ్గు తేల్చే విధంగా సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. అనంతరం తహసీల్దార్ మృత్యుంజయరావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ నేతలు నీతిపూడి గణేష్‌బాబు, కటకంశెట్టి ఆదిత్య, తోరం భాస్కర్, కొనుకు నాగరాజు, పిచ్చుక చిన్న, కూనపరెడ్డి రాంబాబు, చిట్టూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా సమస్యలు పరిష్కరించాలి


పాశర్లపూడిలో జాతీయ రహదారి అభివృద్ధి పనులను సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

మామిడికుదురు: 216వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అభ్యంతరాలను సున్నితమైన సమస్యలను సామరస్య పూరిత వాతావరణంలో శాంతియుతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ రెవెన్యూ, జాతీయ రహదారుల విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం పాశర్లపూడిలో రోడ్డు అభివృద్ధి, విస్తరణకు సంబంధించి కొండాలమ్మ గుడి, వంతెన ప్రాంతాలను పరిశీలించారు. అధికారులు, స్థానికులతో మాట్లాడారు. ప్రభుత్వం బహుముఖ ప్రయోజనాలే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రజలు తమ వంత సహకారం అందించాలని కోరారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఎన్‌హెచ్ పథక సంచాలకులు శ్రీనివాసరావు, ఏఈ వెంకటరమణ, తహసీల్దార్ బి.మృత్యుంజయరావు, డీటీ కె.శరణ్య, ఆర్ఐ అలీ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి చూపించి చెరువులు తొలగించాలి

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఆక్వా చెరువుల సాగుపై ఎన్జీటీ ఇచ్చిన తీర్పు అమలుకై సదరు గ్రామానికి వెళ్లిన వివిధ శాఖల అధికారుల బృందాన్ని ఆక్వా రైతులు నిలదీశారు. శుక్రవారం ఎన్జీటీ తీర్పు అమలులో భాగంగా ముందుగా చెరువుల వద్ద విద్యుత్ కనెక్షన్లు తొలగించేందుకు వెళ్లిన ఆ శాఖ అధికారులతో పాటు, ఫిషరీష్, రెవెన్యూ అధికారులను ఈ మేరకు వారు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైతులు తమ కుటుంబ సభ్యులతో కలసి గోడు వెళ్లబుచ్చుకున్నారు. పంట పండని చౌడు భూముల్లో చెరువులు సాగు చేయడం వల్ల ఉపాధి పొందుతున్నామని వివరించారు. ఉపాధి చూపించి చెరువులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎకరానికి రూ.50 వేల వరకూ లీజు వస్తోందని, పండని పంటలకు రూపాయి రాదుకదా అంటూ వివరించారు. చెరువులు తొలగిస్తే ఏ అవసరాలకు తిరిగి పనికి వస్తుందని రైతులు ప్రశ్నించారు. చిట్టచివరగా ఉపాధికై ఎకరానికి రూ.10 వేలు చొప్పున ఇవ్వండి, చెరువులను మీరే తీసుకోండి అంటూ అధికారుల దృష్టిలో వారు ఉంచారు. సఖినేటిపల్లి పోలీసులు భద్రతా చర్యలను పర్యవేక్షించారు.

ఎండాకు తెగులు నివారణకు చర్యలు తీసుకోండి


పొలంబడిలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ రామ్మోహనరావు

మామిడికుదురు: ప్రస్తుతం వరి పంటపై ఎండాకు తెగులు ప్రభావం ఎక్కువగా ఉందని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు తెలిపారు. పొలంబడి కార్యక్రమం శుక్రవారం ఈదరాడలో జరిగింది. దీనిలో భాగంగా రైతుల పంట పొలాలను ఏడీఏతో పాటు ఏఓ బి.మృదుల పరిశీలించారు. ఎండాకు తెగులు బ్యాక్టీరియా వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. దీని నివారణకు సరైన మందులు అందుబాటులో లేవన్నారు. అందుబాటులో ఉన్న బ్యాక్టీరియా నాశినులు కూడా కొంత వరకు మాత్రమే పని చేస్తాయన్నారు. చివరి ప్రయత్నంగా తెగులు వ్యాప్తిని కొంత వరకు అరికట్టేందుకు లీటరు నీటికి 1.0 గ్రాములు స్రెప్టోమైసిన్ సల్ఫేట్ టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ ప్లాంటోమైసిన్, 3.0 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా 2.0 గ్రాముల కాపర్ హైడ్రాక్‌లైడ్ 53.8 జీఎఫ్ కలిపి పిచికారీ చేయడం శ్రేయస్కరం అన్నారు. నత్రజనిని తగ్గించి పొటాష్ ఎరువును వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఐ.లావణ్య, రైతులు యెరుబండి లక్ష్మయ్య, యెరుబండి భాస్కర నాగేశ్వరరావు, కాండ్రేగుల హేమసుందరరావు, చిక్కం నారాయణమూర్తి, యెరుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోవా ఫొటో ఎక్స్‌పోలో రాజోలు ఫొటోగ్రాఫర్లు


ఉపాధ్యక్షుడు సీవీ రావును అభినందిస్తున్న నిర్వాహకులు

మలికిపురం: గోవాలో జరుగుతున్న అంతర్జాతీయ ఫొటో ఎక్స్‌పోలో రాజోలు తాలూకా స్థాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ బృందం పాల్గొంది. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీవీ రావు ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లు అనేక మంది షోలో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అసోసియేషన్ నాయకులతో కలిసి వివిధ కంపెనీలకు చెందిన కెమెరాలను ప్రదర్శించగా ప్రస్తుత ట్రెండ్‌కు సంబంధించిన ఫొటోగ్రఫీ మెళకువలు ఈ ఎక్స్‌పోలో నేర్చుకున్నట్లు ఉపాధ్యక్షుడు సీవీ రావు తెలిపారు. కార్యక్రమంలో డి.కేశవ, జి.అజయ్, కె.విజయరత్నం, తుని చిన్ని, లోవరాజు తదితరులు పాల్గొన్నారు. సీవీ రావును పుష్పగుచ్ఛంతో నిర్వాహకులు అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పి.గన్నవరం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. వాలీబాల్, కబడ్డీ, కోకో, యోగా, చెస్, చదరంగం, షటిల్ విభాగాల్లో పోటీలు జరిగాయి. జిల్లా స్థాయి పోటీలకు 204 మంది విద్యార్థులను ఎంపిక అయ్యారని నియోజకవర్గ క్రీడా పోటీల కన్వీనర్ కేవీ రమణ తెలిపారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, పులపర్తి చినవెంకట లక్ష్మి, ఎంఈఓలు కోన హెలీనా, వీరభద్రానందం పాల్గొన్నారు.

సొసైటీ భూముల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

సఖినేటిపల్లి: రాజోలు నియోజకవర్గంలోని ఎస్సీ సొసైటీల భూముల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీపీఐ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం అంతర్వేదిలో ఆ పార్టీ మండల సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని దుయ్యబట్టారు. నిత్యావసరాల ధరల నియంత్రణలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. పార్టీ సీనియర్ నాయకుడు జంపన ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన పై సమావేశంలో సీనియర్ నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి, గెడ్డం ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

అంబాజీపేట: దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని వచ్చే నెల 3 నుంచి జరిగే దసరా మహోత్సవాలను భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహిద్దామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద ఉన్న విజయదుర్గ అమ్మవారి దసరా మహోత్సవ కరపత్రాలను శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. 3వ తేదీన అమ్మవారి కలశస్థాపన, 6న మహానైవేద్యం, 9న కుంకుమార్చన, చండీహోమం, 11న దుర్గాష్టమి, 12 విజయదశమి, 13న అన్నసమారాధన, 14న అమ్మవారి ఉద్వాసన, ఊరేగింపులు జరగనున్నాయన్నారు. దశమిని పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి కామేశ్వరశర్మ, కమిటీ నిర్వాహకులు సూదాబత్తుల రవి, వంగ సతీష్ పాల్గొన్నారు.

అదుర్రు నుంచి ఆర్టీసీ సర్వీసు పునః ప్రారంభం

మామిడికుదురు: అదుర్రు బౌద్ధ స్తూపం నుంచి అమలాపురం ఆర్టీసీ బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు బస్సు వద్ద పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి సర్వీసును లాంఛనంగా ప్రారంభించారు. గతంలో అదుర్రు నుంచి ఆర్టీసీ సర్వీసును అమలాపురం నడిపేవారు. అదుర్రు గ్రామానికి ఆర్టీసీ సర్వీసును రద్దు చేయడం వల్ల సమీపంలోని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు ఇదే విషయాన్ని ప్రస్తావించారు. రద్దు చేసిన అదుర్రు ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు గ్రామ పెద్దలు చేసిన ప్రయత్నాల ఫలించాయి. దీంతో అదుర్రు ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరణకు నోచుకుంది. అదుర్రు నుంచి అమలాపురానికి ప్రతి రోజు రెండు ట్రిప్పులు నడుస్తాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అదుర్రు ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల రవికుమార్, కుడుపూడి సురేష్, నేరేడుమిల్లి రామకృష్ణ, కుడుపూడి జగన్నాథం, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

కొత్తపేట: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, అవగాహన కలిగి ఉండాలని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ అనే అంశంలో భాగంగా సాంకేతికత, ఆరోగ్య సంరక్షణపై శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జువాలజీ, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అవిడి పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత ఫాస్ట్‌ఫుడ్‌పై ఆసక్తి చూపుతున్నారని, అవి అంతగా ఆరోగ్యకరమైనవి కావన్నారు. ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ, విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు, అధ్యాపకులు బి.విజయకుమార్, ప్రసన్నజ్యోతి, ఎం హేమలత, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు విడుదల చేయండి

అంబాజీపేట: బకాయి జీతాలతో పాటు సమ్మె కాలపు జీతాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏపీ సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. అంబాజీపేట మండల రిసోర్స్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో తమ జీతాలను ఇప్పించాలంటూ సీఆర్‌ఎంటీ, ఎమ్మార్సీలు, సిబ్బంది, పార్ట్ టైం టీచర్లు ప్లకార్డులు చేతపట్టి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఎంటీఎస్, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. బకాయి జీతాలు విడుదల చేయకపోవడంతో పస్తులు ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని బకాయి వేతనాలు చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని నినాదించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాల జిల్లా మలేరియా యూనిట్ అధికారి సీహెచ్.వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని వివిధ గ్రామాలు పెదపళ్ల, చొప్పెల్ల, పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి నేతృత్వంలోని వైద్య ఆరోగ్య సిబ్బంది డ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీటిని తొలగించి, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రుబ్బు రోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రై డేను వివరిస్తూ బారీ ర్యాలీలు నిర్వహించారు.

లక్కవరం సబ్‌స్టేషన్ పరిశీలన

మలికిపురం: లక్కవరం విద్యుత్ సబ్ స్టేషన్‌ను జిల్లా ఎస్ఈ రాజబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో లక్కవరం, ఇరుసమండ గ్రామాల ప్రజలు రాజబాబును ఘనంగా సత్కరించారు. అనంతరం గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ లక్కవరం ఎస్ఎస్‌లో 5 ఫీడర్లలో ఉన్న గ్రామాలన్నింటికీ మెరుగైన సేవలు అందించేందుకు తగు చర్యలు చేపట్టాలని ఎస్ఈని కోరారు. ఎస్ఈ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, కోట ఏసురత్నం, వలవల రమేష్, పలచోళ్ళ రాంబాబు, ముదునూరి హరి రామలింగ రాజు, శృంగారపు పద్మనాభం, సిద్దిరెడ్డి కాశి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ


రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కోచ్

అంబాజీపేట: తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ప్రతిభ చాటారని సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 26న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–14, 17 స్కూల్ గేమ్స్ జరిగాయి. ఇందులో అండర్–14లో ఎం.మౌనిక, బి.హేమరితిక్, అండర్–17 విభాగంలో పి.చరణ్యశ్రీలు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని త్రిమూర్తులు వివరించారు. వచ్చే నెల 6 నుంచి 8 వరకూ తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఈ ముగ్గురు క్రీడాకారులు పాల్గొనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్‌ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, పీఈటీ ఎ.సూర్యకుమారి, తైక్వాండో రిఫరీలు కె.లక్ష్మీప్రసన్న, పి.భార్గవిశ్రీకళ, కోచ్‌లు పి.మణికంఠ, కె.కుమారి అభినందించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థులు


ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సఖినేటిపల్లి: రాజోలు మండలం పొన్నమండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జీవీ పుంత (అంతర్వేది దేవస్థానం గ్రామం) జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు గెలుపొంది, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం వివరాలను పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాంబాబు తెలిపారు. ఎస్.రాకేష్ వర్మ, బి.మనోజ్ కుమార్, టి.మౌనికలు రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ విభాగాల్లో అర్హత సాధించినట్టు పీఈటీ కె.సతీష్ కుమార్ తెలిపారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ భైరా నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.సత్యనారాయణ వారిని అభినందించారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆత్రేయపురం: స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి అవార్డులు సాధించారు. రావులపాలెం మండలం ఊబలంక జెడ్పీ హైస్కూల్‌లో ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. పరుగు పందెం పోటీల్లో స్థానిక పాఠశాలకు చెందిన వై.హనీ ప్రథమ స్థానం సాధించగా ఎ.దివ్యతేజశ్రీ హైజంప్‌లో ప్రథమ, పరుగు పందెంలో ద్వితీయ స్థానాలను సాధించింది. ఎ.నిహారిక, ఎస్.షర్మిల, ఎస్.నాగ వైష్ణవి, ఎల్.శ్రావ్య తదితరులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ పీఎస్ రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.మురళీకృష్ణ, పీఈటీ ఎస్.రవిరాజు, టి.మంగలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

నీచ రాజకీయాల కోసమే లడ్డూ ఆరోపణలు


తోరం గౌతమ్‌రాజా

మామిడికుదురు: టీటీడీ ప్రతిష్టను దిగజార్చేందుకే సీఎం చంద్రబాబునాయుడు నీచ రాజకీయాలు చేస్తున్నారని పాశర్లపూడికి చెందిన వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు తోరం గౌతంరాజా ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ పవిత్రత, స్వామి వారి లడ్డూ విశిష్టతను మంటగలిపే విధంగా చంద్రబాబు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఆరోపణలు అవాస్తవని యావత్ ప్రపంచానికి తెలిసే విధంగా పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీ శనివారం జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో పూజలు నిర్వహించాలన్నారు. ఐటీ విభాగం సభ్యులు చంద్రబాబు నీచ రాజకీయాలను తిప్పికొట్టే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని గౌతమ్ రాజా పిలుపునిచ్చారు.

రైతుబజార్ తనిఖీ


రైతు బజార్‌ను తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత

రావులపాలెం: స్థానిక రైతుబజార్‌ను మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దానిలోని ప్రతి దుకాణాన్ని పరిశీలించి, కూరగాయల దిగుమతులు, ధరలు, అమ్మకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉల్లిపాయలు, టమాటా, బియ్యం, కందిపప్పు ధరలపై రైతులను ఆరా తీశారు. ఆమె వెంట జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ పి.లావణ్య, జిల్లా అధికారి విశాలాక్షి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ రమేష్, ఎస్టేట్ అధికారి జి.సుబ్బారావు ఉన్నారు.